సాక్షి
నిజామాబాద్

ఆదివారం | 11 | జూన్ | 2023



'ముద్ర' మూడు రకాలు

అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం గుడ్లపై ముద్రలను వేస్తోంది.

- 8లో ▸



అర్హులకు పథకాలు అందించాలి

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలని స్పీకర్ పోచారం అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.1 /29.3

వాతావరణం

ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

తెలంగాణ సాహిత్య దినోత్సవానికి ఏర్పాట్లు

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహిత్య దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఖిల్లా జైలులోని స్మారక మందిరంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యులకు నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. 10 గంటలకు న్యూ అంబేడ్కర్ భవన్‌లో జిల్లాస్థాయి కవి సమ్మేళనం ఉంటుందని, సాయంత్రం 7గంటలకు ముషాయిరా ఉంటుందని పేర్కొన్నారు.

'మహాజన్ సంపర్క్ అభియాన్' విజయవంతం చేయాలి



సుభాష్‌నగర్: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంస్కరణలపై ప్రజలకు తెలియజేసేందుకు నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించి ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12, 13, 14 తేదీల్లో నిర్వహించనున్న మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్‌జవదేకర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం కోసం మోర్చాల సమ్మేళనం, పార్టీ సీనియర్ కార్యకర్తల సమ్మేళన కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారా యణ, శివప్రసాద్, స్వామి యాదవ్, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

గుండెపోటుతోనే రిమాండ్ ఖైదీ మృతి

కామారెడ్డి క్రైం: గుండెపోటు రావడంతోనే రిమాండ్ ఖైదీ బొమ్మన గారి నర్సింలు (40) మృతి చెందాడని ఎస్పీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన నర్సింలు అనే రిమాండ్ ఖైదీ నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 8న రాత్రి 10 గంటల ప్రాంతంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అతని మృతిపై పలు సందేహాలు వ్యక్తం అయ్యాయి. దీంతో స్పందించిన ఎస్పీ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్.. టిక్కెట్ల రేస్

- బరిలోకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్న నాయకులు
- బోధన్ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ నుంచి భూపతిరెడ్డి!
- బాల్కొండ నుంచి మానాల మోహన్‌రెడ్డి రేసులో ముందంజ
- నిజామాబాద్ అర్బన్ నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్ పోటీ చేసేందుకు సిద్ధం
- మరోవైపు అర్బన్ టిక్కెట్టు ఆశిస్తున్న కేశ వేణు, తాహెర్‌బిన్ హందాన్
- ఆర్మూర్ నుంచి ధర్మపురి సంజయ్‌కు చాన్స్?.. టిక్కెట్టు కోసం వేముల రాధిక సురేందర్‌రెడ్డి ప్రయత్నాలు



సుదర్శన్‌రెడ్డి



తాహెర్‌బిన్ హందాన్



మహేశ్‌కుమార్ గౌడ్



మానాల మోహన్‌రెడ్డి



భూపతిరెడ్డి



కేశ వేణు



కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి



రాధిక సురేందర్‌రెడ్డి




ధర్మపురి సంజయ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికల ఫీవర్ ఇప్పటికే మొదలు కావడంతో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలో శాసనసభ టిక్కెట్ల ఆశావహులు రేసులోకి దూసుకొచ్చారు. బరిలోకి దిగేందుకు ఎవరి స్థాయిలో వారు తమవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, ఏ అభ్యర్థి అయితే బాగుంటుంది అంశాలపై వివిధ విడతల్లో, వివిధ వర్గాలను కలిసి సర్వేలు నిర్వహించారు. మళ్లీ వచ్చే నాలుగు నెలల్లోనూ సర్వేలు చేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టిక్కెట్టు రేసులో ఉన్నవారు సర్వేల్లో తమ పేర్లు ముందంజలో ఉండేవిధంగా క్షేత్రస్థాయి కార్యక్రమాల స్పీడ్ పెంచుతున్నారు. టిక్కెట్ల విషయంలో ప్రస్తుతం పోటీ పెరిగింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయంతో కార్యకర్తల్లో ఉత్సాహం రాగా, ఆశావహులు టిక్కెట్ల కోసం గట్టి ప్రయత్నాలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఎవరికి ఇవ్వాలనే విషయమై రేవంత్‌రెడ్డి ఒక ఆలోచనకు వచ్చినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇక ముఖ్యంగా టిక్కెట్ల కేటాయింపులో బీఆర్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నవారిని పరిగణనలోకి తీసుకునే విషయంలో రేవంత్‌రెడ్డి పకడ్బందీగా వ్యవహరించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్లపై గెలుపొంది బీఆర్ఎస్‌లోకి ఫిరాయించినటువంటి వ్యక్తుల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా జాగ్రత్తగా వ్యవహరించాలని పార్టీ నాయకత్వం భావిస్తుండడంతో ఈ చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ విషయంలో దోబూచులాట నెలకొంటే తక్షణమే ఫిరాయించే అవకాశాలున్న వారి విషయంలో జాగ్రత్తగా ఉండడంతో పాటు వారి చరిత్ర మేరకు వ్యవహరించేందుకు నిర్ణయించారు. కోవర్టుల విషయంలోనూ ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచినట్లు రాష్ట్ర స్థాయి నాయకులు చెబుతున్నారు.

■ బోధన్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి, పీసీసీ కోశాధికారి ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి బరిలో ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే బోధన్ నుంచి కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి సైతం టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరికి టిక్కెట్టు కేటాయిస్తారో అనేది తేలాల్సి ఉంది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి కచ్చితంగా బరి లో ఉంటారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పార్టీ నాయకత్వం సైతం భూపతిరెడ్డి విషయమై సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాల్కొండ నియోజకవర్గం నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి టిక్కెట్టు ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, కీలకమైన బీసీ నేత ఈరవత్రి అనిల్ మాత్రం పీసీసీ అధ్యక్షుడికి అత్యంత సన్నిహితుడు కావడంతో రాష్ట్ర పార్టీ వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తే ఈరవత్రికి ఎమ్మెల్సీ ఇస్తారనే చర్చ నడుస్తోంది. దీంతో మానాలకు ఎక్కువ అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పార్టీ సర్వేల్లో సైతం మానాల ముందంజలో ఉన్నట్లు పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

■ నిజామాబాద్ అర్బన్ నుంచి బరిలో నిలిచేందుకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ ఉత్సాహం చూపుతున్నారు. పీసీసీలో నంబర్‌టూగా ఉన్న మహేష్‌కుమార్‌గౌడ్ పోటీలో ఉంటే ఎవరూ పోటీకి రాని పరిస్థితి. అయితే ఈ స్థానం నుంచి టిక్కెట్టు ఆశిస్తున్నవారిలో నగర పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మేయర్, ధర్మపురి శ్రీనివాస్ కుమారుడు సంజయ్‌ను ఆర్మూర్ నుంచి బరిలోకి దించుతారంటూ కొందరు సీనియర్ నాయకులు చెబుతుండడం గమనార్హం. కాగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోదరి అయిన వేముల రాధిక సురేందర్‌రెడ్డి సైతం ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ టిక్కెట్టుపై బరిలోకి దిగేందుకు ఉత్సాహంగా ఉన్నారు. రాధికరెడ్డి ప్రస్తుతం ఖాదీగ్రామీణోద్యోగ్ శాఖలో వరంగల్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్‌గా ఉన్నారు. అదేవిధంగా ఆ సంఘం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈమె ఇప్పటికే కాంగ్రెస్ నాయకత్వంతో మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ నెలలోనే ఉద్యోగానికి రాజీనామా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి సోదరి కాంగ్రెస్ నుంచి రాజకీయ రంగప్రవేశం చేసి, బరిలోకి దిగేందుకు ప్రయత్నాలు చేస్తుండడం పట్ల ఆసక్తి నెలకొంది.



సామాజిక అంశాలు, ప్రకృతిని ప్రతిబింబించే బొమ్మలు, ఆలోచింపజేసే చిత్రాలకు రూపమివ్వడం ఈ చిత్రకారుల ప్రత్యేకత. వాళ్ల గీసిన చిత్రాలు దేశ, విదేశాల్లోనూ గుర్తింపు పొందాయి. క్యారికేచర్, కార్టూన్లు, పెయింటింగ్, పుస్తకాలపై ముఖ చిత్రాలు గీయడంలో వారు నిష్ణాతులు. తమ సృజనాత్మకతతో అద్భుత చిత్రాలకు ప్రాణం పోసి ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు సూరారం శంకర్, మెట్టు రాజు, సుంకోజు రమేశ్. ఈ ముగ్గురూ ముగ్గురే అన్నట్టు వారి కుంచె నుంచి ప్రాణం పోసుకున్న చిత్రాలు స్పష్టం చేస్తాయి. వాళ్ల చిత్రకళపై 'సండే స్పెషల్'.

– సాక్షి, కామారెడ్డి

కుంచె పడితే అద్భుతాలే..

- పుస్తకాలపై 'సూరారం' గీసిన చిత్రాలెన్నో..
- క్యారికేచర్, కార్టూన్లలో దిట్ట మెట్టు రాజు
- పెయింటింగ్‌లో ఆరితేరిన రమేశ్
- ముగ్గురూ ముగ్గురే..

ముఖ చిత్రం వేయాలంటే సూరారమే..



కవులు, రచయితలు తాము రాసిన కవితలు, కథలు, వ్యాసాలకు సంబంధించి పుస్తకాలను ముద్రించేందుకు రెడీ అయ్యారంటే పుస్తకంపై ముఖచిత్రం కోసం సూరారంను సంప్రదిస్తారు. కామారెడ్డి పట్టణానికి చెందిన సూరారం శంకర్ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. గజల్ కవిగా పేరుగాంచిన శంకర్ మంచి చిత్రకారుడు. పుస్తకాలపై ముఖ చిత్రం ఇట్టే గీసిస్తాడు. ఆయన చేతి నుంచి రూపుదిద్దుకున్న చిత్రం ఎన్నో పుస్తకాలపై కనిపిస్తుంది. ఆయన కవితలు, గజల్స్‌కు సంబంధించి పదికి పైగా పుస్తకాలు ముద్రితమయ్యాయి. కాగా సూరారం శంకర్ చేతి నుంచి దాదాపు రెండు వందల పైచిలుకు పుస్తకాల మీద ముఖచిత్రాలు వేశాడు.



నిత్యం ఏదో ఒక బొమ్మ వేస్తూ..



మెట్టు రాజు

భిక్కనూరు మండలం కాచాపూర్‌కు చెందిన మెట్టు రాజు మంచి చిత్రకారుడు. సైన్ బోర్డులు, ఆలయాలపై చిత్రాలు, ఇంకా రకరకాల బొమ్మలు గీస్తూ జీవనం సాగించే మెట్టురాజు క్యారికేచర్ ఆర్టిస్టుగా ఎంతో గుర్తింపు పొందాడు. అలాగే కార్టూన్లు కూడా గీస్తాడు. బొమ్మలు గీస్తాడు. వేలాది బొమ్మలు, క్యారికేచర్, కార్టూన్లు వేశాడు. రాజు వేసిన చిత్రాలకు జాతీయ స్థాయిలోనూ ఎన్నో అవార్డులు వచ్చాయి. అన్ని రకాల కార్టూన్లు, బొమ్మలు గీస్తూ ఎందరి అభినందనలు అందుకున్నారు. నిత్యం ఏదో ఒక బొమ్మను గీస్తూనే ఉంటాడు. అయితే క్యారికేచర్ లేదంటే కార్టూన్, పెయింటింగ్ ఏదో ఒకటి వేసి ప్రదర్శిస్తాడు. పోటీలకు వెళ్లి ఎన్నో బహుమతులు, అవార్డులు అందుకున్నాడు.



ప్రకృతిని తన కుంచెలో బంధించి..



రమేశ్

రాజన్న సిరిసిల్లా జిల్లా కొత్తపల్లికి చెందిన సుంకోజు రమేశ్ కామారెడ్డిలో చదువుకున్నాడు. పీజీలో ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేసిన రమేశ్ పెయింటింగ్‌లో ఎంతో గుర్తింపు సాధించాడు. హైదరాబాద్‌లో ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్న రమేశ్ పెయింటింగ్‌లో జాతీయ స్థాయిలో ఆయన గీసి ప్రదర్శించిన చిత్రాలకు ఎంతో గుర్తింపు లభించింది.



ప్రకృతిని తన కుంచె ద్వారా చిత్రాలు గీయడంలో అందెవేసిన చేయి. అలాగే సామాజిక అంశాలపైనా ఆయన ఎన్నో చిత్రాలు గీశాడు.

సుపరిపాలనలో రాష్ట్రం ఆదర్శం

- కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ సుపరిపాలన దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడుతూ ప్రగతి పథంలో అగ్రగామిగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా మారిందని వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధ్యక్షతన తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలనాపరంగా చేపట్టిన మార్పులు, నూతన సంస్కరణలతో సాధించిన ఫలితాలు, క్షేత్రస్థాయి వరకు ప్రజలకు చేరువైన పాలన, చేకూరుతున్న లబ్ధి తదితర వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ స్వరాష్ట్రంలో సామాన్య ప్రజానీకానికి పాలనను చేరువ చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార వికేంద్రీకరణతో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతూ, సుపరిపాలనకు మార్గదర్శకంగా మార్చారని కొనియాడారు.

ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలు, ప్రభుత్వ ఉద్యోగుల కృషితో రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందన్నారు. రాష్ట్రంలో జోడెడ్ల బండిలా జోరుగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ దార్శనికతతో సుపరిపాలన సాగుతోందని, అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఐటీ సంస్థలన్నీ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ సుపరిపాలన ఫలితంతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పెరిగినా, రాష్ట్రంలో సగటున పౌరుల తలసరి ఆదాయం వృద్ధి చెందిందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ధరణి, టీఎస్–ఐపాస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మేయర్ నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, సీపీవో బాబురావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలాల్లో 'సంపద వనాలు'

- దశాబ్ది ఉత్సవాల్లో మొక్కలు నాటనున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- జిల్లాలో ఏడు మండలాల్లో 42 ఎకరాలు గుర్తింపు
- 19న హరితోత్సవం సందర్భంగా నాటాలని నిర్ణయం



సాట్లాపూర్ తాండా వద్ద మొక్కలు నాటేందుకు ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న హరితోత్సవాన్ని నిర్వహించనున్నారు. సంపద వనాల పేరుతో ఇరిగేషన్ స్థలాల్లో భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏడు మండలాలను ఎంపిక చేయగా, ఇరిగేషన్ అధికారుల సహాయంతో స్థలాలను కూడా గుర్తించారు. ఆర్మూర్, బాల్కొండ, మోపాల్, మాక్లూర్, ఎడపల్లి, మెండోరా, నందిపేట్ మండలాలు కలిపి మొత్తం 42 ఎకరాలు సిద్ధం చేసి ఉంచారు. ప్రధానంగా కెనాళ్లకు ఆనుకుని ఉన్న ఖాళీస్థలాల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేయనున్నారు. అయితే, కేటగిరి–ఏలో అర ఎకరం నుంచి ఎకరం వరకు, కేటగిరి–బిలో ఎకరం నుంచి మూడెకరాల వరకు స్థలాలను గుర్తించారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

నాటిన వెంటనే ఫెన్సింగ్

ఇరిగేషన్ స్థలాల్లో మొత్తం దాదాపు 20వేల మొక్కలు నాటనున్నారు. 19న చేపట్టే ఈ కార్యక్రమం కోసం ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. నిమ్మ, వేప, గుమ్మడి, వెదురు, సీతాఫలం, చింత, జామ, ఉసిరి, మామిడి, ఇతర రకాల మొక్కలను నాటనున్నారు. మొక్కలు నాటిన వెంటనే వాటి సంరక్షణ కోసం స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేయనున్నారు. గేటు, ఆర్చ్‌లను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. వీటికి 'హరిత నిధి' నుంచి డబ్బులు ఖర్చు చేయనున్నారు.

హరితహారం ప్రారంభం అప్పుడేనా?

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం పేరుతో బ్లాక్ ప్లాంటేషన్‌ను చేపడుతున్నారు. అయితే, తొమ్మిదో విడత హరితహారం కూడా ప్రారంభించాల్సి ఉంది. వర్షాలు బాగా కురిస్తే హరితహారాన్ని ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటించాలని అధికారులు భావిస్తున్నారు. వర్షాలు లేకపోతే జూలై మొదటి వారం దాకా ఆగాల్సిందే. తొమ్మిదో విడతలో అన్ని శాఖలు కలిపి మొత్తం 47లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉంది. ఇందుకు గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో 63.60లక్షల మొక్కలను పెంచుతున్నారు.

మొక్కలు నాటేందుకు ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కెనాళ్ల వెంబడి ఉన్న ఇరిగేషన్ స్థలాల్లో బ్లాక్ ప్లాంటేషన్ చేస్తాం. ఇందుకు ఏడు మండలాల్లో 42 ఎకరాల స్థలాలను గుర్తించాం. 19న హరితోత్సవాన్ని విజయవంతం పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొందించాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో

రాజీ కుదిర్చేందుకే లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- జిల్లాలో 7,300 కేసుల పరిష్కారం

ఖలీల్‌వాడి: ప్రజల మధ్య దీర్ఘకాలిక శత్రుత్వాలు, కక్షలు ఉండరాదని.. వారి మధ్య రాజీ కుదిర్చేందుకు లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి సునీత కుంచాల తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో జడ్జి మాట్లాడారు. రాజీపడడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ, అదనపు జిల్లాజడ్జిలు షౌకత్ జహాన్ సిద్దికి, శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బు, గోపికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చండక్, గవర్నమెంట్ ప్లీడర్ శ్రీహరి ఆచార్య పాల్గొన్నారు.

రూ. 4.67 కోట్ల అవార్డులు జారీ

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, అన్నిరకాల సివిల్ దావాలు మొత్తం 7,300 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి తెలిపారు. మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాల్లో రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 4. 67 కోట్లు అవార్డులు జారీ చేశామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లాలో 41 సెంటర్లు
- పరీక్ష రాయనున్న 12,861 మంది అభ్యర్థులు

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించినా.. పరీక్ష పేపర్ లీకవడంతో టీఎస్‌పీఎస్సీ మళ్లీ నిర్వహిస్తోంది. దీంతో ఈసారి పరీక్ష నిర్వహణలో జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. జిల్లాలో వ్యాప్తంగా 12,861 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 41 పరీక్ష కేంద్రాలు ఏర్పా టు చేశారు. 41 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. గతేడాది కంటే ప్రస్తుతం లైజనింగ్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను జిల్లా అధికారులను నియమించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

నగరంలోని గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సెంటర్ల వద్ద ఉన్న అన్ని దుకాణ సముదాయాలను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏసీపీ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 28 మంది ఎస్సైలు, 41 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 50 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు, 47 మంది మహిళ కానిస్టేబుళ్లు, మహిళ హోంగార్డులు, 12 మంది ఆర్మ్‌డ్ పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట: మండలంలోని పర్మళ్ల గ్రామంలో శనివారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ప్రతీ ఏటా మృగశిరకార్తె సందర్భంగా గ్రామ దేవతలకు పండుగలు చేస్తున్నట్లు సర్పంచ్ పర్వయ్య తెలిపారు. ఈ సందర్భంగా కుస్తీపోటీలు నిర్వహించామన్నారు. టెంకాయ కుస్తీ నుంచి వెండికడెం కుస్తీ వరకు నిర్వహించి బహుమతులు అందజేశారు.

'108'లో ఉద్యోగ నియామకాలు

నిజామాబాద్ సిటీ: ఈఎంఆర్ఐ 108 సంస్థలో ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలా 12న నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి 7వ అంతస్తులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూ జరుగుతుందని తెలిపారు. బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీ ఫార్మా, డీ ఫార్మా, డీఎంఎల్టీ చదివి 30 ఏళ్లలోపు వారు అర్హులని వివరించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఒక సెట్ జిరాక్స్ తీసుకుని హాజరు కావాలని కోరారు. వివరాలకు 9100799161 నంబరును సంప్రదించాలని సూచించారు.

బాల్యవివాహం నిలిపివేత

ఖలీల్‌వాడి: నగరరంలోని చంద్రశేఖర్ కాలనీకిలో బాల్య వివాహాన్ని శనివారం అడ్డుకున్నారు. కాలనీకి చెందిన బాలిక(17)కు వివాహం జరుగుతున్నట్లు ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం రావడంతో వెళ్లి నిలిపివేశారు. బాలిక తండ్రితోపాటు కుటుంబసభ్యులకు ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐసీడీఎస్ సిబ్బంది, కానిస్టేబుల్ షౌకత్, హోంగార్డు రఘు తదితరులు ఉన్నారు.

గల్ఫ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి



ఆర్మూర్: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లికి చెందిన పట్కూరి తిరుపతిరెడ్డి గల్ఫ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర చైర్మన్ గుగ్గిల్ల రవి గౌడ్ శనివారం ఆర్మూర్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. రవిగౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గల్ఫ్ కార్మికులు, పసుపు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్న తిరుపతిరెడ్డి గల్ఫ్ బాధితుల పక్షాన ఉద్యమాలు చేయాలని ఆశించారు. స్వదేశ్ పరికిపండ్ల, కృష్ణ బోండ్ల, పరకాల విఠల్‌గౌడ్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి

- సమన్వయంతో పని చేస్తేనే సుపరిపాలన
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పోతంగల్‌లో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటైన పోతంగల్ మండల కేంద్రంలో శనివారం మండల కాంప్లెక్స్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సుపరిపాలన దినోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు, జీపీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 2014 కంటే ముందు నాలుగు మండలాలతో ఉన్న బాన్సువాడ నియోజక వర్గం ప్రస్తుతం 9మండలాలు, ఒక మున్సిపాలిటితో ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అవసరమగు నిధులు కేటాయించానని వెల్లడించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

విభేదాలు పక్కనపెట్టి పని చేయాలి

విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా పని చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు స్పీకర్ హితవు చెప్పారు. విభేదాలతో ప్రజలు ఇబ్బంది పడుతారని, గ్రూపులు మానుకుని సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఐక్యతతోనే సుపరిపాలన అందివ్వగలుతామన్నారు. ప్రజలు పనుల కోసం ప్రజాప్రతినిధులు, నాయకుల వద్దకు వెళ్లడం కాదు.. ప్రజాప్రతినిధులే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమ పథకాలు అర్హులకు అందేటట్టు సహకారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతశ్రీనివాస్‌రావ్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, డీసీసీబీ డైరెక్టర్ శాంతీశ్వర్ పటేల్, తహసీల్దార్ విజయలక్ష్మి, హౌసింగ్ డీఈ నాగేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ హమీద్, జెడ్పీ కో ఆప్షన్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

'ముద్ర' మూడు రకాలు

- అంగన్‌వాడీ గుడ్లు పక్కదారి పట్టకుండా ముద్రలు వేస్తున్న ప్రభుత్వం



అంగన్‌వాడీ గుడ్లపై వేసిన ముద్ర

నిజామాబాద్ సిటీ: జిల్లాలో కొంతమంది అంగన్‌వాడీ సిబ్బంది కోడిగుడ్లను అక్రమంగా కిరాణా దుకాణాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుడ్లపై అంగన్‌వాడీ గుడ్లు తెలంగాణ ప్రభుత్వం అనే ముద్ర వేసి కేంద్రాలకు సరఫరా చేస్తోంది. ఈ చర్యతో గుడ్ల విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది. వేసవిలో గుడ్లు పాడవుతుంటాయని మూడు బ్యాచ్‌ల వారిగా సరఫరా చేస్తారు. ఇందులో మొదటి బ్యాచ్ గుడ్లు తేది 3 నుంచి 10 వరకు పికాక్ బ్లూ కలర్ ముద్ర, రెండో బ్యాచ్ 18 నుంచి 20 వరకు రెడ్ కలర్ ముద్ర, మూడో బ్యాచ్ 23 నుంచి 30 వరకు గ్రీన్ కలర్ ముద్ర వేస్తారు. వానా, చలి కాలాల్లో మొదటి బ్యాచ్ 3 నుంచి 10 వరకు పికాక్ బ్లూ, రెండో బ్యాచ్ 18 నుంచి 24 వరకు రెడ్ కలర్‌తో ముద్ర వేసి గుడ్లను సరఫరా చేస్తారు. వీటిని ఎక్కడైనా విక్రయిస్తే పట్టుకోడానికి అధికారులకు సులువుగా ఉంటుంది. జిల్లాలో నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, ఆర్మూర్, బోధన్, భీంగల్ పట్టణాలలో ఐసీడీఎస్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 12,181 మంది గర్భిణులు, 11,487 బాలింతలు, ఏడు నెలల నుంచి ఏడాదిలోపు పిల్లలు 14,161 మంది, ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు 43,742, మూడు నుంచి ఆరేళ్లలోపు గల వారు 29,410 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు అయి ఉన్నారు. గర్భిణులు, బాలింతలు, కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రోజుకు ఒకటి చొప్పున గుడ్డుతో పాటు పాలు, సంపూర్ణ భోజనం పెడుతుండగా, మూడేళ్లలోపు పిల్లలకు నెలకు 16 కోడిగుడ్లు ఇస్తున్నారు.

అక్రమాలను నిరోధించేందుకే..

అంగన్‌వాడీ కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ముద్రలు వేసి సరఫరా చేస్తుంది. ఇప్పటి వరకు ముద్రలు లేక పోవటంతో వెనుక వచ్చిన గుడ్లను ఇవ్వకుండా తాజాగా వచ్చినవి ఇవ్వటంతో ముందు వచ్చినవి పాడవుతున్నాయి. అందుకే రంగుల వారిగా వచ్చిన గుడ్లను సరఫరా చేస్తే పిల్లలకు నాణ్యతతో కూడిన గుడ్లను సరఫరా చేసే అవకాశం ఉంది.

– రసూల్‌బీ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల

కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇస్తే.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల పాలు చేశారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంగిలి చేత్తో కూడా ఏనాడు ప్రజలకు సహాయం చేయలేదని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. శనివారం కమ్మర్‌పల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కవిత ఏనాడైనా ప్రజలతో మాట్లాడి వారి సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేశారా అని ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని పదవులు పొందే వారికి ఇవేమి తెలియవని ఎద్దేవా చేశారు. ఇతరులను విమర్శించే ముందు ఎమ్మెల్సీ ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడి భాగ్య, నాయకులు ఏలేటి గంగాధర్, తక్కూరి దేవేందర్, సుంకెట రవి, బోనగిరి భాస్కర్, పడిగెల ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడి



సిరికొండ: మండల కేంద్రంలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కుర్దుల్‌పేట్ గ్రామస్తులు శనివారం ముట్టడించారు. సబ్ స్టేషన్ నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంటున్నదని వారు వాపోయారు. చిన్న పాటి గాలి వచ్చిన విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసే పరికరాలు లేకపోవడంతో ప్రతి పనికి సబ్‌స్టేషన్ వద్దకు రావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఏఈ చంద్రశేఖర్‌తో సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ సతీష్, బీఆర్ఎస్ నాయకులు ఆదిత్య తదితరులు మాట్లాడారు. మరమ్మతులు చేయిస్తానని ఏఈ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

ఎట్టకేలకు రోడ్డేశారు

- చిన్నయానం గ్రామస్తులకు తీరిన ఇబ్బందులు

సాక్షి ఎఫెక్ట్..



చిన్నయానం వద్ద బీటీ రోడ్డు వేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని చిన్నయానం గ్రామానికి ఎట్టకేలకు బీటీ రోడ్డు పడింది. సరైన రోడ్డు మార్గం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఏప్రిల్ 24న 'సాక్షి' దినపత్రికలో 'చిన్నయానం అంటే చిన్నచూపా!' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో రోడ్డు పనులు ప్రారంభించిన అధికారులు ఇటీవల పూర్తి చేశారు. నడ్కుడ నుంచి చిన్నయానం ఊరి చివరి వరకు మొత్తం 2.7 కిలో మీటర్లు రోడ్డు వేయగా, దీనికి రూ.2.69కోట్లు ఖర్చయినట్లు ఆర్అండ్‌బీ ఏఈ రఘు వెల్లడించారు. ఏళ్ల తర్వాత తమ ఊరికి రోడ్డు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకున్న గ్రామస్తులు

రెంజల్: లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా నిర్వహించలేదని, డబ్బులు తీసుకుని అనర్హులను ఎంపిక చేశారని ఆరోపిస్తు మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. తహసీల్దార్‌తో పాటు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వెళ్లిన ప్రజాప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలను అందించేందుకు నిర్ణయించారు. 48 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు శనివారం స్థలాలు పంపిణీ చేసేందుకు గ్రామానికి చేరుకున్నారు. తహసీల్దార్ రాంచందర్, ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ గ్రామానికి వెళ్లగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి తరలివచ్చారు. గ్రామంలో దండోరా వేయించకపోవడంపై మండిపడ్డారు. లబ్ధిదారులను ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఆర్ విచారణ చేసిన తర్వాతనే అర్హులకు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆర్ఐ గ్రామానికి రాలేదని, రెవెన్యూ సహాయకునితో పాటు పలువురు గ్రామస్తులు అందించిన పేర్లనే ఎంపిక చేశారని గ్రామస్తులు ఆరోపించారు. డబ్బులు తీసుకుని అనర్హులను గుర్తించారని మండిపడ్డారు. గ్రామంలో గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల సమక్షంలో అర్హులను గుర్తించాలని పట్టుబట్టడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు వెను తిరిగి వెళ్లిపోయారు.

ఓయూలో నందిపేటవాసి పుస్తకావిష్కరణ



నందిపేట: నందిపేటకు చెందిన బొమ్మనోల్ల రాహుల్ తన గైడ్ సంధ్యారాణి సహకారంతో రాసిన మూడో పుస్తకాన్ని ఓయు రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, వాణిజ్య శాస్త్ర విభాగధిపతి చెన్నప్ప, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం ఎంబీఏ, ఎం కాం, బి.కాం వారికి ఎంతో ఉపయుక్తకరమని పుస్తక రచయితలు సంధ్యారాణి, రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ చిన్న వయసులో మూడు పుస్తకాలు రాయడం అభినందనీయమని ప్రొఫెసర్లు అన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తా



అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: మండలంలోని జంగిలోడి తండా పరిధిలోని చింతల్ తండా నుంచి అటవీ ప్రాంతం మీదుగా రాంచంద్రపల్లి తండాకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తానని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హామీ ఇచ్చారు. చింతల్ తండా నుంచి రాంచంద్రపల్లి తండా వరకు రోడ్డు మార్గం వెళ్లే అటవీ ప్రాంతాన్ని డీఎఫ్‌వో వికాస్‌మీనాతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. రాంచంద్రపల్లి తండా వాసులు రోడ్డు లేక చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను తొలగిస్తానని తెలిపారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అటవీ శాఖ నుంచి అనుమతులు త్వరగా వచ్చేలా చూస్తానన్నారు. గిరిజన శాఖ నుండి మండలంలోని వివిధ రోడ్ల నిర్మాణానికి రూ. 60 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం జంగిలోడితండాకు మంజూరైన జీపీ భవనానికి స్థలాన్ని పరిశీలించారు. జెడ్పీటీసీలు జగన్, మాన్‌సింగ్, వైస్ ఎంపీపీ రాజన్న, ఎఫ్ఆర్వో ఎంవీ నాయక్, రావుట్ల ఉపసర్పంచ్ రఘువాస్ ఉన్నారు.

రేకులపల్లి రోడ్డు పరిశీలన

ధర్పల్లి: ధర్పల్లి నుంచి రేకులపల్లి వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతం మధ్యలో నిలిచిపోయిన రోడ్డు పనులను ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్, డీఎఫ్‌వో వికాస్ మీనాతో కలిసి శనివారం పరిశీలించారు. రెండేళ్ల క్రితం ఈ మార్గంలో రోడ్డు మంజూరు కాగా, మధ్యలో అటవీ ప్రాంతం ఉండడంతో పనులను ఫారెస్ట్ అధికారులు నిలిపివేశారు. మధ్యలో ఐదు కిలోమీటర్ల వరకు రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఫారెస్ట్ ఉన్నత అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ జగన్, రాజ్‌పాల్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, హనుమంతురెడ్డి, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆవును ఢీకొన్న బైక్ : మహిళ మృతి

ధర్పలి: ఉపాధి హామీ పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఆవును బైక్ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన ధర్పల్లి శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. ధర్పల్లికి చెందిన కొత్తింటి లింగవ్వ(50), బుచ్చన్న భార్యాభర్తలు. వీరు శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులను ముగించుకొని బైకుపై ఇంటికి వస్తుండగా ఆవును ఢీకొన్నారు. దీంతో ఇద్దరు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా లింగవ్వ(50) మృతి చెందింది. బుచ్చన్న నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి అల్లుడు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..



కవిత(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్)/ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ తండా గేట్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం బూర్గుపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కవిత(35) తన భర్త జవహర్‌తో కలిసి ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్తుండగా బండిపై నుంచి జారి పడిపోయింది. దీంతో ఆమెను ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. సదరు వ్యక్తి బీహార్, ఒడిశా ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. మద్యం తాగి చనిపోయాడా లేక వడదెబ్బతో చనిపోయాడా అని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సిరికొండ: మండలంలోని కొండూర్ శివారులో పాడుబడ్డ బావిలో గుర్తు తెలియని మహిళ(42) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై నర్సింలు శనివారం తెలిపారు. సర్పంచ్ అందించిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందన్నారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీయించగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఖననం చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను ఢీకొన్న వ్యక్తిపై కేసు

లింగంపేట: మండలంలోని అయ్యపల్లి గ్రామానికి చెందిన బొక్కల నాగమణి లింగంపేటలో రోడ్డు దాటుతుండగా ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. శుక్రవారం రాత్రి మహిళను ఢీకొన్న కారు ఆపకుండా పారిపోవడంతో విషయం తెలుసుకున్న ఎస్సై వెంటనే తాడ్వాయి ఎస్సైకి సమాచారం ఇచ్చారు. తాడ్వాయి పోలీస్ స్టేషన్ ముందు కారును అడ్డగించి పట్టుకున్నారు. అజాగ్రత్తగా, అతివేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అఖిల్ హైదరాబాదుకు చెందిన వాడుగా గుర్తించినట్లు తెలిపారు.

పాలవ్యాన్ బోల్తా



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామ శివారులోని కృషి దర్శన్ వద్ద శనివారం తెల్లవారుజామున డివైడర్‌ను ఢీకొని పాలవ్యాన్ బోల్తాపడింది. డిచ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల కంపెనీకి చెందిన పాల వ్యాన్ శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు పాలను తీసుకువచ్చింది. దుకాణాల్లో పాలను డెలివరీ చేసి శనివారం తెల్లవారుజామున తిరిగి వ్యాన్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు. కృషిదర్శన్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులో అజాగ్రత్తంగా నడపడంతో వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

గుడిసె దగ్ధం

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ తండాలో శనివారం రాత్రి షేక్ యూసుఫ్ గుడిసె దగ్ధమైంది. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గుడిసె కాలిపోయింది. ప్రమాదంలో సామగ్రితో పాటు రూ.20 వేల నగదు కాలిపోయింది. జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.మూడు వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందజేశారు.

పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ



ఫోన్లను అందజేస్తున్న డీఎస్పీ, సీఐ

బాన్సువాడ: సీఈఐఆర్ యాప్ ద్వారా 11 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి శనివారం బాధితులకు అందజేసినట్లు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ డివిజన్‌లో ఇప్పటి వరకు 50 నుంచి 60 ఫోన్లను యాప్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. శనివారం అహ్మద్‌పాష అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను దుబాయి నుంచి రప్పించామన్నారు. బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

మాయమాటలు చెప్పి.. వివాహమాడి..

- తల్లిదండ్రుల మాట విని భార్యను వదిలేసిన యువకుడు
- న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట ఆందోళన చేసిన యువతి



భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న రజిత

కామారెడ్డి రూరల్: ఓ దివ్యాంగురాలికి మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల పాటు ఇద్దరు కలిసి ఉన్నారు. విషయం తెలుసుకున్న యువకుడి తల్లిదండ్రులు కొడుకును తీసుకొని ఇంటికి వెళ్లిపోయారు. దీంతో ఆమె ఒంటరి అయి భర్త కోసం నిరీక్షిస్తోంది. చివరకు భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈ ఘటన కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. భిక్కనూరు మండలం పొందుర్తి గ్రామానికి చెందిన రజిత దివ్యాంగురాలు. ఆమెకు కామారెడ్డి మండలం నర్సన్నపల్లికి చెందిన జశ్వంత్ రెడ్డితో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. ఆరు నెలల క్రితం జశ్వంత్‌రెడ్డి, రజిత వివాహం చేసుకున్నారు. నాలుగు నెలల అనంతరం జశ్వంత్‌రెడ్డి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఆయనను రజిత నుంచి వేరు చేశాడు. జశ్వంత్‌రెడ్డిని ఇంటికి తీసుకువెళ్లి మరో అమ్మాయితో వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. విషయం తెలుసుకున్న రజిత న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ చుట్టు తిరిగింది. ఎవరు స్పందించకపోవడంతో శనివారం తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. తన భర్తను తనకు అప్పగించాలని అత్తమామలను వేడుకుంది. తనకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చుంది.

మహిళ కడుపులో నుంచి ఐదు కిలోల గడ్డ తొలగింపు

కామారెడ్డి టౌన్: తీవ్రంగా కడుపు నొప్పితో వచ్చిన మహిళకు ఆపరేషన్ చేసి కడుపులో నుంచి 5 కిలోల గడ్డను వైద్యులు తొలగించారు. వివరాలు.. పట్టణానికి చెందిన మామిండ్ల లక్ష్మి కడుపు నొప్పితో పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరారు. స్కానింగ్ చేసిన డాక్టర్ నవీన్‌కుమార్ గర్భసంచికి గడ్డ అయిందని ఆపరేషన్ చేయాలని తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక వైద్య బృందాన్ని పిలిపించి ముగ్గురు వైద్యుల ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి కడుపులో నుంచి 5కేజీల గడ్డను బయటకి తీశారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య

గాంధారి: మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన తన్నీర్ సతీష్ కుమార్(23) శుక్రవారం రాత్రి ఇంట్లో దులానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై గణేష్ తెలిపారు. వివరాలు.. సతీష్ కొన్ని రోజులుగ ఏమి పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో శుక్రవారం ఉదయం తండ్రి సాయిలు మందలించాడు. మనస్తాపం చెందిన సతీష్ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి గదిలోకి వెళ్లాడు. గదిలో పడుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. చప్పుడు లేదని గదిలోకి వెళ్లి చూడగా సతీష్ దూలానికి వేలాడుతు కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఒకరు..



భూమయ్య (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన రైతు అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గాడి భూమయ్య (45) ఎనిమిది నెలల క్రితం వ్యవసాయ బావి వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి ఆయనకు ఒళ్లంత నొప్పులు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై పలు ఆస్పత్రులు చుట్టూ తిరిగిన ఎలాంటి ఫలితం కనిపించక పోవడంతో భూమయ్య తరచు బాధ పడేవాడు. ఈ నెల 9న పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. నొప్పులు భరించలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి భార్య గాడి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాని ఎస్సై తెలిపారు.